సిమ్ కార్డ్ రీప్లేస్‌మెంట్‌కు కొత్త రూల్స్

రేపటి నుంచి అమలు చేయనున్న ట్రాయ్

న్యూఢిల్లీ: మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ నిబంధనలకు చేసిన సవరణలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సిమ్ స్వాప్, రీప్లేస్‌మెంట్‌లో మోసాలను అరికట్టేందుకు ఈ సవరణలు చేసినట్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తెలిపింది. ట్రాయ్ తెలిపిన వివరాల ప్రకారం, సిమ్ స్వాప్ లేదా రీప్లేస్‌మెంట్ అంటే, ప్రస్తుత సబ్‌స్క్రైబర్ తాను పోగొట్టుకున్న లేదా పని చేయని సిమ్ కార్డుకు బదులుగా కొత్త సిమ్ కార్డును తీసుకునే ప్రక్రియ. యూజర్లు దేశంలోని ఒక యాక్సెస్ ప్రొవైడర్ నుంచి మరొక యాక్సెస్ ప్రొవైడర్‌కు మారినప్పటికీ, తమ మొబైల్ నెంబర్‌ను యథాతథంగా కొనసాగించుకోవడానికి మొబైల్ నంబర్ పోర్టబిలిటీ అవకాశం కల్పిస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం ఈ సదుపాయాన్ని కూడా యూజర్లు పొందవచ్చు. మొబైల్ నెంబర్ సిమ్ స్వాప్ లేదా రీప్లేస్‌మెంట్ తేదీ తర్వాత ఏడు రోజులు పూర్తి కాకుండా యూనిక్ పోర్టింగ్ కోడ్ (యూపీసీ) కోసం రిక్వెస్ట్ చేస్తే, ఆ రిక్వెస్ట్‌ను తిరస్కరించాలని తాజా నిబంధనలు చెప్తున్నాయి. ఈ గడువు గతంలో పది రోజులు ఉండేది. ఈ పది రోజుల వ్యవధి సరైనదేనని కొందరు చెప్పారని, మరికొందరు మాత్రం దీనివల్ల అర్జెంట్ పోర్టింగ్ అవసరమైన సమయాల్లో సబ్‌స్క్రైబర్లకు అసౌకర్యంగా ఉంటుందని, దీనిని రెండు లేదా నాలుగు రోజులకు కుదిస్తే సహేతుకంగా ఉంటుందని చెప్పారని ట్రాయ్ తెలిపింది. అందుకే దీనిని ఏడు రోజులకు తగ్గించినట్లు వివరించింది.

గైడ్ బుక్‌లతో డిగ్రీ పరీక్షల్లో కాపీ

మధ్యప్రదేశ్‌లో మాస్ కాపీయింగ్ తీరిది!

మొరేనా, జూన్ 29: నీట్ లీకేజీ ఉదంతం నేపథ్యంలో బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని మొరేనా జిల్లాలో మరో షాకింగ్ ఘటన చోటు చేసుకొన్నది. జీవాజీ యూనివర్సిటీ శనివారం నిర్వహించిన బీఏ, బీఎస్సీ పరీక్షల్లో ఓ కాలేజీ ఎగ్జామ్ సెంటర్‌లో విద్యార్థుల మాస్ కాపీయింగ్ బయటపడింది. ఉపాధ్యాయుల సమక్షంలోనే కాపీ కొట్టడం సంచలనంగా మారింది. విద్యార్థులు చిట్టీలతోపాటు ఏకంగా గైడ్‌బుక్‌లను పెట్టుకొని కాపీ కొడుతుండటం చూసి ఆశ్చర్యపోవడం తనిఖీకి వచ్చిన తహశీల్దార్ జ్యోతి లక్షకర్ వంతైంది. కేఎస్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లోని ఎగ్జామ్ సెంటర్‌లో జరిగిన ఈ కాపీయింగ్ వ్యవహారాన్ని ఒకరు కెమెరాలో రికార్డు చేశారు. ఈ కాపీయింగ్ స్కామ్‌లో ప్రిన్సిపాల్, టీచర్లు, సిబ్బంది భాగస్వామ్యం ఉన్నదని తహశీల్దార్ పేర్కొన్నారు.

బీజేపీకి జీఎంఆర్ భారీ విరాళాలు

ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అందజేత

న్యూఢిల్లీ, జూన్ 29: ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో టెర్మినల్-1 కూలి ఒకరు మరణించిన ప్రమాదం తర్వాత విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ గ్రూప్ ఇప్పుడు ప్రధానంగా వార్తల్లోకి వచ్చింది. 2018 నుంచి ఆ సంస్థ అధికార బీజేపీకి ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా పెద్దయెత్తున విరాళాలు అందజేసిన సంగతి వెలుగులోకి వచ్చింది. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అధికార పార్టీకి పరోక్ష మార్గంలో భారీగా నిధులందజేసిన సంస్థల్లో జీఎంఆర్ ఒకటి. కాగా, ఎలక్టోరల్ బాండ్లు అన్నవి ఎన్నికల ముందు వ్యక్తులు, సంస్థలు తమకు నచ్చిన పార్టీలకు విరాళాలు ఇచ్చే ఒక విధానం. అయితే ఎలక్టోరల్ ట్రస్ట్ అన్నది రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేసేందుకు ఉద్దేశించిన మరో ప్రక్రియ. దీనికి నిర్దిష్ట కాలపరిమితి లేదు. ఏడాది పొడవునా ఎప్పుడైనా వ్యక్తులు, సంస్థలు ట్రస్ట్‌కు విరాళం ఇవ్వవచ్చు.

88 శాతం కుబేరులు

అగ్రవర్ణాల వారే

- భారత్‌లో 90 శాతం సంపద వారి చేతుల్లోనే
- బిలియనీర్ల జాబితాలో కనిపించని ఎస్సీ, ఎస్టీలు
- ఈ తరహా అసమానతలు ప్రమాదకరం: ఆర్థికవేత్తలు
- ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 29: దేశంలో ఒక పక్క బిలియనీర్ల సంపద ఎన్నో రెట్లు పెరుగుతుండగా, సామాన్యుడు మరింత పేదవాడు అవుతున్నాడు. ఈ తేడా సామాజికవర్గ పరంగా కూడా స్పష్టంగా పెరిగింది. దేశంలోని బిలియనీర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీలకు స్థానమే లేకుండా పోయింది. దేశంలోని 90 శాతం సంపద అగ్రవర్ణ బిలియనీర్ల చేతిలో కేంద్రీకృతమై ఉంది. ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తాజా నివేదిక ఈ వాస్తవాలను వెల్లడించింది. 'భారత్‌లో పన్ను న్యాయం, సంపద పునర్ విభజన వైపు' పేరుతో వెలువడిన తాజా నివేదిక సంపద పంపిణీ సమస్యలను పరిశీలించింది. దేశంలోని మొత్తం సంపదలో 40 శాతం కేవలం ఒక శాతం ఉన్న వర్గం చేతిలో ఉండటం దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తున్నదని పేర్కొన్నది. బ్రిటీష్ పాలన కాలంతో పోలిస్తే ఈ ఆధునిక యుగంలో అసమానతలు ఇలా ఎన్నో రెట్లు పెరగడం చాలా ప్రమాదకర ధోరణి అని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని కారణంగా ఇప్పటికే భారత్ ప్రపంచంలోని ఆర్థిక అసమానతలున్న దేశాల జాబితాలోకి చేరిపోయిందని వివరించారు.

ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదిక ప్రకారం భారతదేశంలోని 88.4 శాతం బిలియనీర్లు ఉన్నత వర్గాలకు చెందిన వారే. ధనవంతుల జాబితాలో షెడ్యూల్డ్ తెగలు, ఇతర బాగా వెనుకబడిన వర్గాలకు అసలు ప్రాతినిధ్యమే లేదు. ఈ తారతమ్యం బిలియనిర్ల సంపదలో కూడా కొట్టొచ్చినట్టు కన్పించింది. జాతి సంపదలో 55 శాతం ఉన్నత వర్గాల చేతిలో ఉన్నట్టు ఆల్ ఇండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే (ఏఐడీఐఎస్) 2018-19లో చేసిన సర్వే ప్రకారం వెల్లడించింది. సంపద వైవిధ్యంలో ఈ పూర్తి వైరుధ్యం భారత దేశకుల వ్యవస్థలో పాతుకుపోయిన లోతైన అసమానతలను స్పష్టం చేస్తున్నది. అలాగే సామాజిక వర్గం విద్య, ఆరోగ్యం, వ్యాపారం, సంపద సృష్టి తదితర అంశాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తున్నది. దళితులు ఎక్కువ భూమిని కలిగి ఉండరాదని పలు ప్రాంతాల్లో ఉన్న ఆంక్షలు కూడా వారి ఆర్థిక ప్రగతికి ఆటంకంగా మారింది. అయితే ఈ వివక్ష కేవలం బిలియనీర్ల వరకే పరిమితం కాలేదు. దిగువ సామాజిక వర్గం వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కూడా పలు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ద స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా, 2023 పేరిట అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. శ్రామికశక్తి అధికంగా ఉన్నప్పటికీ ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగలేకపోతున్నారు. ఎస్సీల శ్రామిక శక్తి 19.3 శాతం ఉండగా, అందులో 11.4 శాతం, ఎస్టీల్లో 10.1 శాతం శ్రామిక శక్తికి 5.4 శాతం మాత్రమే యజమానుల స్థాయికి ఎదిగారు.

అత్యధిక ఎస్సీ, ఎస్టీల సంపద వర్గీయులే

సంపద అసమానత దిగువ వర్గాల సామాజిక వర్గాలలో బిలియనీర్ల ర్యాంకులకు మించి విస్తరించింది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నివేదిక ప్రకారం 12.3 శాతం ఎస్సీలు, 5.4 శాతం ఎస్టీలు మాత్రమే అత్యధిక సంపద కలిగి ఉన్నారు. అయితే దానికి విరుద్ధంగా 25 శాతం పైగా ఎస్సీలు, 46.3 శాతం ఎస్టీలు అత్యల్ప సంపద వర్గంలో ఉన్నారు. అలాగే ఓబీసీ జనాభాలో 16.3 శాతం అత్యల్ప సంపద కేటగిరీ, 19.2 శాతం అత్యధిక సంపద కేటగిరీలలో ఉన్నారు. భారత్‌లో ఆదాయం, సంపదల మధ్య వ్యత్యాసం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తగ్గినప్పటికీ 1980 నుంచి 2000 వరకు పెరుగుతూ వచ్చింది. 2014-15, 2022-23 మధ్య ఈ పెరుగుదల శిఖరాగ్ర స్థాయికి చేరుకుంది. దీంతో దేశంలోని 40 శాతం సంపద కేవలం ఒక శాతం వర్గం ఆధీనంలో ఉంది. 1980లో ఇది 12.5 శాతం మాత్రమే ఉండేది. అలాగే వారు మొత్తం పన్నుకు ముందు ఆదాయంలో 22.6 శాతం సంపాదిస్తున్నారు. ఇది 1980లో 7.3 శాతం ఉంది.

బ్రిటీష్ పాలనలోనే మెరుగు

బ్రిటీష్ పాలన నాటితో పోలిస్తే భారత దేశంలో ఆర్థిక అసమానత నాటకీయంగా పెరిగింది. దీంతో ఆర్థిక అసమానతలు గల దేశాల లిస్ట్‌లో భారత్ కూడా చేరింది. ప్రస్తుత అంచనా ప్రకారం దేశంలో ఏడాదికి రూ.20.7 లక్షలు సంపాదించే వారు ఒక శాతం ఉండగా, 10 శాతం మంది ఏడాదికి రూ.2.9 లక్షలు ఆర్జిస్తున్నారు. దీనికి విరుద్ధంగా మధ్యస్థ వయోజనులు ఏడాదికి లక్ష మాత్రమే సంపాదిస్తుండగా, పేదలకు ఎలాంటి ఆదాయం లేదు. జనాభాలోని దిగువ 60 శాతం మంది జాతీయ సగటు ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే పొందుతున్నారు. ఏడాదికి 21 లక్షలు సంపాదించే వారిని ధనవంతులుగా పరిగణిస్తారు. వీరు దేశంలో 10 శాతం ఉన్నారు. ఏడాదికి 82 లక్షలు ఆర్జించే వారు అత్యంత ధనవంతులు కేటగిరీలోకి వస్తారు. వీరు ఒక శాతం ఉన్నారు. ఇక మధ్యస్థంగా ఉన్న వారు ఏడాదికి 4.3 లక్షల ఆదాయాన్ని కలిగి ఉన్నారు. ఈ మొత్తం వీరి కనీస అవసరాలకు సరిపోతున్నది తప్ప ఎలాంటి సంపదను కూడగట్టలేరు. ఇక మిగిలిన 50 శాతం మందిది అత్యల్ప ఆదాయం. జాతీయ ఆదాయంలో వీరిది 6.4 శాతం కాగా, కేవలం 1 శాతం ఉన్న కుబేరుల వాటా 40.1 శాతం. ఇక 0.001 శాతం ఉన్న అపర కుబేరుల వాటా 17 శాతం. దీని ప్రకారం కేవలం 0.001 శాతం ఉన్న 10 వేల లోపు అపర కుబేరుల ఆదాయం, అట్టడుగు స్థాయిలో ఉన్న 50 శాతం (సుమారు 46 కోట్ల మంది) సంపదతో సమానం.

భారత్‌లోని బిలియనీర్ల శాతం కులాల వారీగా

ఏడాది	అగ్ర వర్ణాలు (ఓసీ)	(ఓబీసీ)
2012	79 %	19.6 %
2014	78.10%	20%
2016	79.70%	16.80%
2018	81.70%	14.40%
2020	84.30%	11.60%
2022	88.40%	9%

శిక్షణలో జవాన్ల జల సమాధి

యుద్ధ ట్యాంక్ మునిగి ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, జూన్ 29: లద్దాఖ్‌లో భారత సైన్యం శిక్షణలో విషాదం చోటుచేసుకుంది. ష్యోక్ నదిలో ఆకస్మికంగా వరదలు పోటెత్తడంతో యుద్ధ ట్యాంక్ ఒకటి నీళ్లలో మునిగిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. శుక్రవారం రాత్రి వాస్తవాధీన రేఖకు సమీపంలోని న్యోమా-చుషుల్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. శిక్షణ ముగించుకొని వస్తుండగా, అనూహ్యంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. జవాన్ల మృతిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని అధికారులు వెల్లడించారు. మృతుల్లో జూనియర్ కమిషన్డ్ అధికారి ఒకరు ఉన్నారు.

వర్షానికి కూలిన టెర్మినల్ పైకప్పు

రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టులో ప్రమాదం

న్యూఢిల్లీ, జూన్ 29: గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టు టెర్మినల్ బయట వాహనాలు ఆగే చోట నీడ కోసం ఏర్పాటు చేసిన పందిరి పైకప్పు భారీ వర్షానికి కూలిపోయింది. న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టు టెర్మినల్-1 కూలిపోయిన ఒక రోజు తర్వాత ఈ ఘటన జరిగింది. అయితే నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు మరమ్మతులు జరుగుతుండగా పందిరి విరిగిపోయినట్టు పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని, దీనిపై నివేదిక కోరినట్టు వారు చెప్పారు.

రెండు రోజుల్లో నీట్ పీజీ కొత్త షెడ్యూల్

కేంద్ర మంత్రి ప్రధాన్

న్యూఢిల్లీ: ఇటీవల వాయిదా పడిన నీట్-పీజీ పరీక్ష కొత్త షెడ్యూల్‌ను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) రెండు రోజుల్లో ప్రకటిస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం వెల్లడించారు. ఇటీవల రద్దు అయిన, వాయిదా పడిన మూడు పరీక్షల కొత్త తేదీలను ఎన్టీఏ ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన్ ఈ మేరకు నీట్-పీజీ కొత్త షెడ్యూల్‌పై హర్యానాలోని పంచకులలో మాట్లాడారు. నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల వివాదం నేపథ్యంలో ఈ నెల 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసిన విషయం తెలిసిందే.

'భావి ప్రధాని అఖిలేశ్'!

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను భావి ప్రధానిగా పేర్కొంటూ యూపీ రాజధాని లక్నోలో పోస్టర్లు వెలిశాయి. జూలై 1న అఖిలేశ్ పుట్టినరోజు సందర్భంగా వెలిసిన ఈ పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి. తాజా లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అనూహ్య ఫలితాలు సాధించడమే ఈ చర్చకు కారణం.

గంగలో కొట్టుకుపోయిన కార్లు

ఢిల్లీలో భారీ వర్షాలు.. 11కు చేరిన మృతుల సంఖ్య

న్యూఢిల్లీ: ఉత్తరాదిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, హరిద్వార్, హల్ద్వానీ, కోట్‌ద్వార్ ప్రాంతాల్లో వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గంగా నదిలో అనేక కార్లు కొట్టుకుపోతున్నట్లు కనిపిస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఢిల్లీ నగరంలో శనివారం కూడా భారీ వర్షాలు కురిశాయి. మృతుల సంఖ్య 11కు చేరింది. మంత్రి ఆతిశీ ఢిల్లీ ఎల్జీతో భారీ వర్షాలపై చర్చించారు.

రాజ్యాంగ నైతికత దేశ విభిన్నత్వానికి అవసరం

జడ్జీలను దేవుళ్లుగా చూడటం ప్రమాదకరం: సీజేఐ

న్యూఢిల్లీ: రాజ్యాంగ నైతికతను న్యాయవ్యవస్థలో అమలు చేయడం దేశ విభిన్నత్వానికి అవసరమని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. భారత రాజ్యాంగానికి న్యాయమూర్తులు సేవకులు మాత్రమే, యజమానులు కాదని తెలిపారు. న్యాయమూర్తుల వ్యక్తిగత విలువలు, విశ్వాసాలు, జోక్యం.. వంటివి రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన తీర్పుల్ని తీసుకొస్తాయని హెచ్చరించారు. కోల్‌కతాలో ఆయన ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. న్యాయశాస్త్రంలో రాజ్యాంగ నైతికత అమలు..గురించి వివరించారు. కోర్టులను దేవాలయాలుగా, జడ్జీలను దేవుళ్లుగా చూస్తే..అది చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలను నెరవేర్చటమే న్యాయమూర్తుల ప్రధాన కర్తవ్యమన్నారు.'మమ్మల్ని లార్డ్‌షిప్, లేడీషిప్..అంటూ గౌరవంగా సంబోధిస్తారు. ప్రజలకు సేవకుడిగా ఉండటమే జడ్జి పాత్ర' అని జడ్జీలను ఉద్దేశించి సీజేఐ అన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లోనూ కాదు, రాజ్యాంగ నైతికత జిల్లా న్యాయవ్యవస్థకు కూడా వర్తిస్తుందన్నారు.

సీపీఎంపైనా ఈడీ కేసు?

కేరళలోని కో ఆపరేటివ్ బ్యాంక్ నిధుల గోల్‌మాల్ కేసులో కీలక పరిణామం

తిరువనంతపురం, జూన్ 29: మనీ లాండరింగ్ ఆరోపణల కేసులో సీపీఎంను నిందితుల జాబితాలో చేర్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సిద్ధమవుతున్నది. కేరళలోని త్రిస్సూర్‌లో ఉన్న కరువన్నూర్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసును ఈడీ గత ఏడాది నుంచి విచారిస్తున్నది. సీపీఎం ఆధ్వర్యంలో నడిచే ఈ బ్యాంకులో సిబ్బంది, స్థానిక సీపీఎం నేతలు రూ.300 కోట్లకు పైగా నిధులను స్వాహా చేశారనే ఆరోపణలు వచ్చాయి. రాష్ట్రాన్ని కుదిపేసిన ఈ వ్యవహారంలో సీపీఎం ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఏసీ మొయిదీన్‌కు బ్యాంకు బినామీ లోన్లను మంజూరు చేసిందని ఈడీ గత ఏడాది పేర్కొన్నది. మొయిదీన్ గతంలో త్రిస్సూర్ జిల్లా సీపీఎం కార్యదర్శిగా పని చేశారు. అయితే ఈ కేసులో సీపీఎం ప్రమేయం కూడా ఉందని ఈడీ భావిస్తున్నది. ఇప్పటికే పార్టీకి చెందిన కార్యాలయ స్థలం, వేర్వేరు బ్యాంకుల్లో ఉన్న రూ.60 లక్షలను ఈడీ అటాచ్ చేసింది. ఇప్పుడు పార్టీని సైతం నిందితుల జాబితాలో చేర్చేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఈడీ కేసును న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ ప్రకటించారు. కాగా.. గత నెల ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఆమ్ ఆద్మీ పార్టీపై ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఒక రాజకీయ పార్టీని నిందితుల జాబితాలో చేర్చడం అదే మొదటిసారి.

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి

కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ జేడీయూ తీర్మానం

పాట్నా, జూన్ 29: కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు మిత్రపక్షమైన జేడీయూ నుంచి అప్పుడే సెగ మొదలైంది. బీహార్‌కు ప్రత్యేక క్యాటగిరీ హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జేడీయూ పార్టీ జాతీయ కార్యవర్గం శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అదేవిధంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్యసభ ఎంపీ సంజయ్ ఝాను నియమిస్తూ సమావేశం నిర్ణయం తీసుకొన్నది. పోటీ పరీక్షల పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని జేడీయూ డిమాండ్ చేసింది. నీట్ యూజీ పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ తీర్మానం చేసింది. కేంద్రంలో బీజేపీ ఈసారి టీడీపీ, జేడీయూ పార్టీలపై అధారపడి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో.. బీహార్ సీఎం నితీశ్ కుమార్ పార్టీ జేడీయూ 'ప్రత్యేక హోదా' అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకురావడం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకొన్నది.

మమతపై పరువు నష్టం దావా

రాజ్‌భవన్‌పై వ్యాఖ్యల పట్ల గవర్నర్ ఆగ్రహం

కోల్‌కతా, జూన్ 29: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య విభేదాలు ముదురుతున్నాయి. మమతా బెనర్జీపై గవర్నర్ బోస్ శుక్రవారం కోల్‌కతా హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఆమెతో పాటు పలువురు తృణమూల్ కాంగ్రెస్ నేతలపైనా ఆయన దావా వేశారు. ఇటీవల రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ కాంట్రాక్టు ఉద్యోగిని తనపై గవర్నర్ ఆనంద బోస్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన సంగతి తెలిసిందే. కోల్‌కతా పోలీసులు ఈ ఆరోపణలపై విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా రెండురోజుల క్రితం సచివాలయంలో జరిగిన ఓ సమావేశంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. 'ఇటీవల జరుగుతున్న ఘటనల వల్ల మహిళలు రాజ్‌భవన్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నట్టు నాకు చెప్పారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల పట్ల ఆగ్రహించిన గవర్నర్.. మమత, ఆమె పార్టీకి చెందిన పలువురు నేతలపై కోర్టుకెక్కారు.

నాయకత్వ గందరగోళం

- కర్ణాటక సీఎం మార్పు, డిప్యూటీ సీఎంలపై కాంగ్రెస్‌లో విస్తృత చర్చ
- గొంతెత్తుతున్న మంత్రులు, పలువురు పార్టీ నేతలు
- తమ వర్గానికి సీఎం పోస్టు ఇవ్వాలని పలువురు మఠాధిపతుల డిమాండ్లు

బెంగళూరు, జూన్ 29: కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు.. చివరకు పలువురు మఠాధిపతులు కూడా ఎవరికి వారు వర్గాలుగా విడిపోయారు. సీఎం పదవిని తమ వర్గం నేతలకు ఇవ్వాలని లేదా ఒకవేళ అదనంగా డిప్యూటీ సీఎం పోస్టులను ఏర్పాటు చేస్తే తమ వర్గం నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని బహిరంగంగానే డిమాండ్లు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో నాయకత్వ సంక్షోభం నెలకొన్నది.

సిద్ధరామయ్య దిగి.. డీకేను సీఎం చేయాలి

ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్రంలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న ఒక్కలిగ వర్గానికి చెందిన డీకే శివకుమార్ ఒక్కరే డిప్యూటీ సీఎంగా ఉన్నారు. వీరశైవ-లింగాయత్, ఎస్సీ/ఎస్టీ, మైనార్టీ కమ్యూనిటీలకు కూడా డిప్యూటీ సీఎం పదవులు ఇవ్వాలనే డిమాండ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైన గత ఏడాది నుంచే ఉన్నది. ఇటీవల ఆ డిమాండ్ మరింత ఊపందుకొన్నది. ఒక్కలిగ మహా సమస్థాన మఠానికి చెందిన చంద్రశేఖర కాంత స్వామీజీ గత గురువారం ఓ సందర్భంగా మాట్లాడుతూ 'సీఎంగా మీరు దిగిపోయి, డీకేను ముఖ్యమంత్రిని చేయండి' అంటూ బహిరంగంగానే సీఎం సిద్ధరామయ్యను కోరడం సంచలనంగా మారింది. దీనికి తర్వాతి రోజు వీరశైవ-లింగాయత్ మత పెద్ద శ్రీశైల జగద్గురు సిద్ధరామ పండితారాధ్య స్వామిజీ శుక్రవారం మాట్లాడుతూ ఒకవేళ రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం పరిశీలనలో ఉంటే.. తమ వర్గానికి చెందిన మంత్రులను సీఎం పదవికి పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా అదనపు డిప్యూటీ సీఎం పోస్టులను ఏర్పాటు చేస్తే, అందులోనూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

నాకు ఎవరి సిఫారసు అవసరం లేదు: డీకే

'నాకు ఎవరి సిఫారసు అవసరం లేదు. మేం చేసిన పనికి.. మా హైకమాండే నిర్ణయం తీసుకొంటుంది' అని డీకే శివకుమార్ అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంల అంశంపై బహిరంగంగా లేదా మీడియాతో ఏ మంత్రీ మాట్లాడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

మల్టీ విటమిన్లతో ఆయుష్షు పెరగదు

- త్వరగా మరణించే ముప్పు పెరగొచ్చు
- ఆహారం ద్వారానే పోషకాలు అందాలి

న్యూయార్క్, జూన్ 29: ప్రతిరోజూ మల్టీవిటమిన్ సప్లిమెంట్లు తీసుకోవడం ఆయుష్షు పెరగడానికి ఉపయోగపడదని, పైగా త్వరగా మరణించే ముప్పుకు కారణం కావొచ్చని ఒక అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు 1990ల నుంచి 3,90,124 మందిపై దాదాపు 20 ఏండ్ల పాటు అధ్యయనం చేశారు. ఇందుకు సంబధించిన వివరాలు 'జామా నెట్‌వర్క్ ఓపెన్'లో ప్రచురితమయ్యాయి. ఎక్కువ కాలం జీవించడానికి మల్టీవిటమిన్ సప్లిమెంట్లు ఉపయోగపడటం లేదని, మరణ ముప్పును ఏమాత్రం తగ్గించడం లేదని పరిశోధకులు గుర్తించారు. పైగా మల్టీవిటమిన్లు తీసుకోని వారి కంటే తీసుకుంటున్న వారు త్వరగా మరణించే ముప్పు 4 శాతం పెరిగినట్టు తేల్చారు. మల్టీవిటమిన్ సప్లిమెంట్లను తీసుకోవడం కంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మంచిదని డాక్టర్ నీల్ బార్నార్డ్ తెలిపారు. తీసుకునే ఆహారంలో సూక్ష్మ, అతి సూక్ష్మ పోషకాలు, పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, సంతృప్త కొవ్వు, కొలెస్ట్రాల్ తక్కువ ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. మల్టీవిటమిన్ సప్లిమెంట్లు తీసుకోవడం కంటే ఆహారంలో ఎక్కువగా కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్లు తీసుకోవడం మంచిదని మరో పరిశోధకురాలు డాక్టర్ జేడ్ ఏ కోబెర్న్ తెలిపారు. మాంసం, మద్యపానం, ఒకేచోట కూర్చోవడం తగ్గించాలని ఆమె సూచించారు.

చదివేది బీఎస్సీ.. బోధించేది సివిల్స్

సొంతంగా నోట్స్ ప్రిపేర్.. యూట్యూబ్‌లో క్లాసులు • 10 లక్షల సంపాదనతో కారు కొన్న కేరళ కుర్రాడు

తిరువనంతపురం: నమ్మకం, కృషి ఉంటే అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చునని నిరూపించాడు కేరళకు చెందిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థి సయూజ్ ఎస్ చంద్రన్. తనకున్న జ్ఞానాన్